**శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్**
**నవ్య వీక్లీ సంయుక్త నిర్వహణ కథల పోటీలో**
**ప్రథమ బహుమతి రూ. 10,000**
**పొందిన కథ**

ఏటో ఈ సంజేల ఇన్నిన్ని ముచ్చట్లు సెప్పటానికొస్తన్నయి నాకు. సంజేల దగ్గర పడుతుంటే ముచ్చట్లే ముచ్చట్లు, ఒకిటే ముచ్చట్లు!
ఇనేవోల్లు వున్నారా లేదాని కాదు. అలగొచ్చేత్తన్నాయి, నోటి నిండా అయే ముచ్చట్లు.
తొలీత నా ముచ్చట్లు పుట్టింది నాను పైటేసిన కాణ్నుండి. నాను సమర్తాడి పైటేసుకున్ననాడు మా అయ్య నాకు ఎండికాలి పట్టాలు – మువ్వలు మువ్వలయ్యి కొనిచ్చాడు. అయి నా కాల్లెకెట్టుకుని సూసుకునీ సూసుకునీ తలికి నాకు ముచ్చట్లొచ్చేసినయ్యి.

కాలి పట్టాలు, నా కాల్ల సొగసులు సూసుకుంటా సెర్లో కాల్లూపుతు కూకుంటే... అక్కడికే... అప్పుడక్కడికే నా బావొచ్చీనాడు.
ఆడొచ్చి నన్ను జూసీ, నా కాల్లు జూసీ, నా కాల్ల పట్టాలు జూసీ నవ్వుకుంటా... ఎనక్కెనక్కు తిరిగి తిరిగి నవ్వుకుంటా సూస్తూ ఎలిపోనాడు.

# ఎలియిపోనాది!

## జంధ్యాల మాలతి

బావెందుకు నవ్వినాడబ్బా, ఏటి నాకాల్లు బానేవనా, కాల్ల పట్టాలు బానేవనా?

బావెందుకు నవ్వినాడో ఎవుల్నడిగేది, అమ్మనా? అయ్యనా?

అయ్యయితే నవ్వేసి 'జడ కుచ్చులు సేయించీదేటి, అయీ సూసుకుంటూ వుందూగాని' అంటాడు.

అమ్మయితే 'ఎల్లవే, ఎల్లి ఒంటా–ఒద్దికా సూసుకో. కట్టుకున్నోడు సుకపడతాడు, మాకూ మంచి పేరొత్తాది' అంటాది.

ఇంకెవుర్నగడను? అత్తమ్మ నడుగుతా.

'అత్తమ్మా, సెర్లో కాల్లెట్టుకుని నాను కాల్ల పట్టాలు సూసుకుంటా వుంటే నన్ను జూసి బావ నవ్వినాడు. ఎందుకంటావ్?' అనడిగా.

'అలగా' అన్నాది నా యత్తమ్మ.

ఆ ఏసంగిలో బావకీ, నాకూ లగ్గమెట్టి పెల్లి సేసీనారు.

నవ్వు ముచ్చటంతే... పెల్లి ముచ్చటని అప్పుడరదమయింది నాకు.

అగో అప్పటి కాణ్నించి ముచ్చట్లే ముచ్చట్లు... ఒకిటే ముచ్చట్లు.

పెల్లవ్వీ అవ్వగానే అత్తోరింటికాడ కొచ్చీనాను.

సీటికీ మాటికీ నన్నే పిలిసి జడట్టుకు గుంజీవోడు బావ.

'ఏటి బావా నా జడ వుండాల్నా, లేదా. జడూడిపోతే పూలెట్టా ఎట్టుకునేది?' అన్నానా.

అత్తమ్మ నవ్వింది... పడీ పడీ నవ్వింది. బావ నవ్వీనాడు... పొట్టపట్టుకు నవ్వినాడు.

ఇగనెప్పుడూ నాను నా జడ గురించి వూసెత్తలా.

అదేటో ఇసిత్రం... జడ గురించంతే అంత నవ్వేటి?

ఉండుండి పిల్సీవోడు బావ. 'ఎందుకలగ, వుండుండి కేకేత్తావేటి? అత్తమ్మ ఇంటే కోప్పడీగల్దు' అన్నానా.

'నా పెల్లాన్ని నాను పిలిస్తే ఎవుతే కోప్పడీది, నా ముంగలకి రమ్మను' అని మీసం తిప్పీవోడు బావ.

తడికవతల్నుంచి అత్తమ్మ నవ్వు.

పెతీదానికి నవ్వే... ఇద్దరకిద్దరూ.

అప్పుడలగ ఇసుక్కున్నానా. ఇప్పుడా ముచ్చట తల్సుకుంటే నాక్కూడా నవ్వొచ్చేత్తాది.

ఒకోసుట్టు ఎండేలప్పుడు పొలం పని ఏట్నేపోతే పొట్టపొగులు జడట్టుకు, 'పక్కలోకి రాయే' అని పోరు. 'అత్తమ సూస్తాది ఒల్లక తొంగో' అంటానా.

'నానేటీ సూణ్నేదు, నానేటీ ఇన్నేదు. ఈదికేసి సూత్తా తొంగుంటన్నా' అని అత్తమ్మ కిచకిచ. అది ఇని ఈడూ కిచకిచ.

ఒల్లంతా సిగ్గుతో పుల్లడి పోనాది.

ఈ ముచ్చట తల్సుకుంటే ఇప్పుడు ఒల్లంతా కోక సుట్టుకున్నట్టు సిగ్గు సుట్టుకుంటాది. ఓ పాలి ఏమయ్యిందంటే ఆవులికి గడ్డికోసుకు రాటానికి తను పొలాలెంబడి ఎల్లింది.

వోనాకాలం... ఎక్కడ సూసినా బురద బురద... సీర గోసిపోసి కట్టుకు గడ్డి కొయ్యబోయింది.

ఈ నోపు మెరకీది ఈరిగాడొచ్చి తనతో ఆసికాలాడి సెయ్యట్టుకున్నాడు. తను మాత్తరం ఒల్లకుంటదా, సేతిలో కొడవల్సూపించి గొల్లుగోసా పెట్టీతలికి నలుగురికీ తెల్సిపోనాది.


సాయంకాలం పొలానికెల్లిన బావెంతకూ రాలా.

దీపాలెట్టినంక చిర్రుబుర్రులాడతా ఒచ్చాడు.

ఏడేడి నీల్లు తానం జేత్తా 'ఏటే ఈరిగాడేటి తోక జాడించేడేటి ఇయ్యాల?' అన్నాడు.

'మరే ఆబోతులా రంకెలేసిండు' పొయ్యికింద మంట ఎగదోస్తా అన్నానా. పొయ్యి మీద అన్నం కుతకుతలాడ్తంది.

'అంటాడంటాడు. ఆడు ఆబోతా, నానేం దూడలా కనిపించానా ఆడికల్లకి? దొంగనాయాల, మక్కెలిరగదన్నాను. ఎముకలు కుల్ల బొడిశాను. ఎదవ, ఎదవాని... మరి నీ జోలికిరాడ్లే' అన్నాడు



గావంచా ఎట్టి ఎకరవంత ఈపు తుడుసుకుంటా.

'నా మొగుడు సినేమా ఈరోయ్ అనుకుంత న్నాను' అని నవ్వుకుంటా ఆడి ఈపు తుడవటంలో సాయంసేశా.

'మరేటి నా ముంగల ఎన్టీవోడు దిగదుడుపే' అంటూ నన్ను మీదికి లాక్కున్నాడు.

దొంగ ముచ్చట్లు. ఏం సక్కిలిగింతల ముచ్చట్లవి!

'ఏటి ఎన్నాల్లు జూసినా నీల్లోసుకోవేటి?' అని అత్తమ్మ అంటున్నట్టే వుంది.

పెద్దోడు కడుపులో పడ్డాడు. ఇగనేటుంది ఆలిద్దరికీ తొందరతొందర. ఎర్రి పేమలూ.... ఎర్రి మమతలూ... సింతకాయలొకల్లు తెత్తే, నిమ్మారగాయ ఒకరు తెచ్చీవోరు. అత్తమ్మ అరిసెలొండి పెడితే బావ మిఠాయి తెచ్చీవోడు. ఎంతా నందమనీ!

'అత్తమ్మా నానంటే ఎంత పేమే నీకు' అంటా అత్తమ్మ కాల్లు పట్టేదాన్ని.

'నీ మీద పేమేంటే ఎర్రిదానా, నీ కడుపులో పిల్లాడు బేగీ నా సంకలో కొచ్చీయాల్నికాపోతే' అని నవ్వీసేది.

బావైతే ఇల్లాగుమ్మాలంట తన్ను ఎత్తుకు తిప్పీవోడు. చుక్కల చుక్కల నల్లచీర, దాని మీదకి సింతపూల రైక కొన్నాడు.

నెల మీద నెల వస్తుంటే గుండెల ఎత్తులకి పూల పూల రైక బిగుస్తోండేది.

అది సూసి ఆడు 'నరసా, నువ్వెప్పుడు బిడ్డను కని పాలిత్తా నా ఎదర్న కూకుంటావో. ఇప్ప ట్నుంచీ అదే ఇసయం అనుకుంతన్నాను!' అనేవోడు.

సిగ్గుతో వుసారొచ్చి కల్లలో మెరుపులు నిండిపోయీవి.

తను మెరుపు కల్లతో ఆడ్ని జూస్తే ఆడి కల్లలోకి ఆ మెరుపులు పాకి, అవి మల్లా ఇద్దరి ఒల్లల్లోకి పాకిపోయేవి. ఏం ముచ్చట్లవి!

పెద్దోడు పుట్టి ఆడికి నడకా, మాటలు ఒచ్చీతలికి రెండోపాలి కడుపు పండింది.

'అప్పుడే వుంకో గుంటడా' అని బావంటే...

అత్తమ్మ గింజుకుని 'ఆః.... డజొన్లకి డజొన్లు కన్నారని మా ఎర్రెత్తి పోతన్నారు. అలగనగూడదర్రా పిల్లలూ. పిల్లలు ఎందరుంతే అంతకలకల్లాడుద్ది ఇల్లు. దురదుట్టపు మాటలాడకండి. దురదుట్ట దేవతల కల్లడతయి పిల్లలమీన' అని సాగదీసేది.

అత్తమ్మ ఎన్ని తూర్లు నీల్లోసుకున్నా దక్కింది బావొక్కడే. అందికనే ఆడికి 'సిట్టెయ్య'ని పేరెట్టారు.

అత్తమ్మ మాట ఇన్నంక లెంపలేసుకున్నారు తనూ, బావా.

నిజమే, 'తదాత్తు దేవతలుంతారంట. మనం పాడు మాటలంటే అయి అయితీరతాయంట' తను పని సేసే ఇంటోరి పాప సెప్పింది.

ఆ యమ్మ బాగా సదూకుంది. ఎన్ని ఇసయాలో తెల్సు.

తనప్పుడప్పుడు ఆయమ్మ కాడ కూకుని తన అత్తమ్మ ఇసయం, బావ ఇసయం సెప్తుంటే మరీ ఇట్టంగా ఇనేది.


'నరసా, నువ్వూ, మీ బావ నండూరి వారి ఎంకీ, నాయుడుబావలా కనిపిస్తారు నాకు' అనేది.

'నా కదేం తెల్దమ్మా అంటే' ఆ పాప ఎంకిపాటలు పాడేది.

అప్పుడనుకున్నా. ఆ పాటలు నాకూ, మా బావకీ వస్తే బాగుంటాదని!

అయినా పాటలే కావాలేంటి కల్లబాసలు సాలదూ కడుపు నిండి పోడానికి!

ఆ పాప ఓ పాటలో 'కల్లెత్తితే సాలు కనకాబిసే కాలు' అని పాడింది.



'ఏటవి?' అన్నాను. 'ఎంకి కల్లల్లోంచి బంగారం కురుస్తుందట' అని ఇవరం సెప్పింది.

'నా కల్లలో అలగ కురుసుద్దా' అన్నానోపాలి బావతో.

'నీ కల్లలోనే ఏటి, నీ వూసుల్లో, సేతల్లో అంతా బంగారు వర్సమేనే నరసా. దబ్బ పండునాగ పచ్చ గుంటావు మరి' అన్నాడు బావ.

ఆ ముచ్చట్లతో ఆనాడూ, ఈనాడూ కడుపు నిండకేం జేస్తది!

మూడోపాలి కూతురు మాలచ్చిమి పుట్టింది. ఆ పిల్ల అచ్చట్లూ, ముచ్చట్లూ సూడకుండానే అత్తమ్మ కాలంసేసింది.

అత్తమ్మ పోతూపోతూ 'నరసా, ఇల్లూ బిడ్డలు ఒకెత్తు. మొగుడొక్కడూ ఒకెత్తు. ఆణ్ని ముందు ఎంత బాగా సూస్కుంతే నీ బతుకు అంత బాగుంటాది. అది మాత్తరం మరిసిపోకు. పెతీఏడాదీ మనూరి పైడి తల్లెమ్మకు గొర్రెపోతుని బలెయ్యడం మరిసిపోకు' అని మరీ మరీ సెప్పింది.

తనా మాటలు ఎప్పుడూ మరిసిపోలేదు!

పెద్దోడు, సిన్నోడు ఎంత సెప్పినా సదూకోలేదు కాని, పాప మాలచ్చిమి బాగా సదూకునేది.

అంతవరకింట్లో ఎవరూ సదూకోనేదు. గాని అది మట్టుక్కు పది దాక సదివింది.

రేతిల్లు తిల్లు దిన్నాక తనకెన్నో వూసులు సెప్పేది.

రామాయనం, బారతం కతలు సెప్పేది.

తను సదివిన పాటాల పుత్తకాలట, వాటిల్లో ఇసయాలు సెప్పేది.

ఓ సుట్టు సితోరుగర్ మారాజు, పదిమిని కత సెప్పింది.

ఆ మారాజు పేరేదో సెప్పింది మరిసాను. సితోరుగర్ రాణా, అతని బారియ పదిమిని. అల్లావుద్దీను అనే తురక నవోబు ఒకడు పదిమిని అందం అద్దంలో సూసి ఆవిణ్ని కావాలనుకున్నాడంట. అందుకు రాజు కాదంటే ఆ నవోబు ఆయన మీదకు యుద్దం సేసినాడంట. యుద్దంలో మారాజు పాపం ఓడిపోయినాడు. సివరాకరుకు సనిపోయాడంట. పదిమిని రాజపుతురుల పిల్లంట. ఆల్లు మా సెడ్డ పవురుసం గల్లోల్లంట. సితిలో పడి సనిపోయిందంట గాని నవోబుకి సిక్కనేదంట.

ఆ కత ఇని తను పదిమినీ రానీ కోసం ఎంతో బాద పడిపోనాది.

ఆకత ఇసయం బావకు సెప్పితే బావ, 'రానీ పదిమినికి అలగ అన్నేయం అయిపోనాది గాని నానే సితోరుగరు రాజునయింటే నవోబుని గెలవనిత్తానా? పదిమినీ రాని సితిలో పడేట్టు సెయ్యనిత్తానా. నాను ఈరుణ్ణి. నా పదిమిని కలాటి అన్నేయం సేయను. రానీకి అన్నేయం కానీను' వుక్రోసంతో అలా అని తనను కావిలించుకున్నాడు!

నిజంగా నాను పదిమినీ రానీని అనుకున్నాడయుంటాది!

'ఇదేటిది, ఇవాలో, నిన్నో లగ్గమయ్యిందా మనకి, ఇలగటి మాటలాడతావు' అని తను పైకంటానే నోపల్లోపట మహా సంబరపడింది.

ఈ ముచ్చట తల్సుకుంటే గుండే, గొంతూ ఇప్పటికీ సంతోసంతో వుబ్బిపోతయ్యి.

'సెల్లిని సదివించారు. రేపు సెల్లికి పెల్లిసేత్తారు. మరి నా మాట, తమ్ముడి మాట ఏటి?' అన్నాడు పెద్దోడో రోజు.

'ఏటీ, మీ ఇద్దరినీ సదివించనన్నానా. గోలీకాయలాడుకుంటా సెరూగట్లంట దిరిగి... నా కొడకల్లాలా మాట్లాడకండి' అన్నాడు బావ.

పెద్దోడు పెద్దోడే. అమాయకుడు, వూరుకున్నాడు.

పొలం సంగోరు అమ్మేసి మా లచ్చిమి పెల్లి సక్కగా సేసినారు.

అది పేట్టరీల పన్జేసే సూర్రావు పెల్లమై కులసాగుంది.

ముందొచ్చిన సెవలకంటే ఎనకొచ్చిన కొమ్ములు వోడి అని – పెద్దోడు తాటాకు మంటలాటోడు 'బుస్' అని అంటుకుని మంట బేగీ మాడి నుస్సై పోద్ది.

సిన్నోడు అలగకాదు. 'సంగోరు పొలమమ్మినారు మరి మాకేటుంది. ఏటిస్తారు మాకిద్దరకీ?' అనడిగాడు.

'ఇంగా మేం వున్నాములా. ఇల్లుంది. పొలముంది. కట్టపడే మీ యమ్మా నాన్నా వున్నారు. నోరు మూసుకుని కట్టపడి సంపాయించడం నేర్చుకో ముందు' అని ఆడి నోరు మూయించేడు బావ.

ఎంతేనా బావ తెలివైనోడు! అలగైతే పొంగిపోతాడు. అంత వొయిసయినా, సరసాలు తగ్గనేదు. పిల్లలిద్దరూ పనుల్లోకి ఎలిపోతే సరసాలకి దిగేవోడు. ఆ ముచ్చట్లే ఓ పెద్దముచ్చట!

ఆ ఏడు మాగమాసంలో సురేకాంతాన్నిచ్చి పెద్దోడికి మనువుసేశారు.

పెద్దోడు బాగా సంబరపడ్డాడు. సురేకాంతం దగ్గర బందుగుల పిల్లే. ఒద్దికైంది. దాంతోబాటూ కొంత సారే, కొంత కట్నవూ తెచ్చింది.

ఆ వున్న జాగాలో మరో మిద్దెగది ఏసుకున్నారు.

ఆల్లూ ఆనందంగా వున్నారు.

బావెంతో పొంగిపోయాడు.

'సిట్టెయ్యా నువ్వూ నరసా ఎంతేనా అదురుట్టమంతులు' అని బందుగులు ఎవరన్నా అంటే ములగ సెట్టెక్కి పోయేవోడు.

'అంత మురిసిపోకయ్యా, ముసలయ్యా' అనేది తను.

'ఎఁ. ఎల్లే. నానప్పుడే ముసలోణ్నయి పోనానా, జార్త. నీకు సవితినట్టుకొచ్చీగల్ను' అంటూ తనను ఈదంతా పరిగెట్టించి ఎంటపెట్టేవోడు. ఈదిలో అందరూ నవ్వు.

తను నవ్వు... కోడలు నవ్వు... కొడుకులు నవ్వు..

నవ్వులతో ఇల్లు మల్లిపువ్వుల వోసనతో నిండిపోయింది. ఎంత ఏడుకనీ!

పెద్దోడికి పెల్లయిన రొండేల్లకి సిన్నోడికి మనువైంది. తమ్ముడి కూతురే, సెంద్రిక!

పేరు నాగే పిల్ల సెందమామ నాగుంటది.

అయినోల్ల పిల్ల, అందమయిన పిల్ల – అందరూ ఆనందపడ్డారు.

ఆల్ల పెల్లవుతూనే ఆల్ల కోగది కావాలని తీసుకున్నారు.

మాం ఒరండాలో మిగిలేం. తరాత్తరాత ఒరండాకి తలుపులెట్టుకున్నాంలే!

పెద్దోడి బారియ సురేకాంతం పేరుకే సినేమా సురేకాంతం గాని, గుణానికి కాదు. అంచాత ఇంటో ఎప్పుడూ గొడబలు లేవు.

సిన్నాడి బారియ సెంద్రిక సూత్తే అందంగాని, సుకమేటి? సోకు లెక్కువ. గొడబా గోసా ఎక్కువ.

అది గోసెడితే ఏటీ అన్లేక బావతో సెప్పుకునేది.

ఓసారి పైకే ఏడవబోతే 'నీకిలా కాదన్నాడు'.

తలుపులు సారేసి 'ఏడుత్తావా ఏడూ మల్ల' అన్నాడు.

ఏడవటానికి మొదలుపెడితే ముకం వంచి ముద్దు పెట్టాడు.

తను కల్లు పెద్దవిసేసి సూసింది.

అంతకు ముందెప్పుడూ తమ మద్దెలో ముద్దుల్లేవు.

'ఇంగంతే. ఏడ్సావా, కోడల్లని ఏమన్నా అన్నావా అక్కడికక్కడే ఎక్కడున్నదీ, ఎవురున్నదీ సూడకండా ముద్దు పెడతాను... కాదు... కాదు... ముద్దులెడతాను. దెబ్బతో నీ గొడవపోద్ది. కోడల్లూ, కొడుకులూ నన్నేట నగ్గలు' అని నవ్వాడు.

నవ్వి మల్లీ ముద్దు పెట్టాడు.

ముద్దుపెట్టి మల్లీ ముద్దుపెట్టాడు.

ఆ యేల నుంచీ తను కోడల్ల మీన బావతో ఏమన్నా సెప్పితే ఒట్టు.

బయం పడిపోయింది. నలుగురిలో ఎక్కడ ముద్దులెట్టేత్తాడోనని!

అయితే ఏమాట కామాటే.

బావ ముద్దెడితే బాగుంది.

బావ చేత మల్లీ ముద్దులెట్టించుకోవాలని అప్పుడప్పుడు కోడల్ల మీన కొండాలు సెప్పినట్టుగా మాటలు మొదలెట్టేది.

బావ గబుక్కున ముద్దులెట్టేవోడు.

కొన్నాల్లకి బావకి తను ముద్దులెట్టించుకోవాలనుకుంటోందని అరదమైంది.

'ఇయ్యాలా, రేపూ ముద్దులు పేసనే. నీకు తెలీదు కాని మన సిన్నోడూ, సిన్నకోడలూ ముద్దులెట్టుకోడం

---

కవిత

## గాథ

అడవిలో
సగం
ప్రవహిస్తాయ్
సెలయేళ్ళై
పండిస్తాయ్
మైదానాలై



*

కోరి చేరిన
నీటి
బొట్టును
భారంగా
జారుస్తుంది
ఆకు



*

చీకటిని
తుంచే
వెలుతురు
పంచే
వెన్నెల
స్నేహం




–కొలకలూరి ఇనాక్

నాను శానా సుట్లు సూశాను'.

'అవ్వ. అలగ సూడ్డం తప్పుకాదా?!

'ఎశ్. నేనేం ఆల్లగదిలో కెల్లి సూశానేటి. ఆల్లే మన మల్లిపందిరికాడ కూకుని ముద్దు మీన ముద్దు ఎట్టీసుకుంటుంటారు. సిన్నకోడలు సినేమా లెక్కువ సూసిద్ది కదా. అందుకని గావాల ఆల్లకి అలవోటయ్యింది. దీన్ల ఏముందాని నిన్ను ముద్దుపెట్టాలని సూశాను. మామూలుగయితే నువ్వొప్పవు. అందుకని గొడబల సాకుతో నీకు ముద్దులు నేరిపించేను'.

'సిట్టెయ్య బావో, నీకు తెలివి మితిమీరిపోనాది' అని అరిచింది తను ఆపుకోలేని సంతోసంతో.

'ఆఁ... మరి నీ బావంటే ఏటనుకున్నావ్?'

'నీ కిప్పుడు వయసెంతా?'

'నీ మీద ఆరేల్లుంటాది. నలపయ్యి అయిదుంటాది. ఇదో ఒయిసూ, ఇదో నీక్కావలసుంటే సెప్పు. మల్లీ పిల్లలు కందాం'

'సీ పో... పాడు మాటలు' అన్నానా, తన బుగ్గలు ఎరుపెక్కాయి.

'ఏం ఇదివరకియ్యి పాడు మాటలు కావా' రా దగ్గరికి.

బావకి అందకుండా బయటికొచ్చి నుంచింది.

మీసాలు దువ్వుకుని నవ్వుతున్నాడు బావ.

ఒంటిమీన పులకరింతలు రేపే ముచ్చట్లే అన్నీ.

ఓ రోజు మా లచ్చిమి ఏడుస్తా ఇంటికొచ్చింది.

బావా, తనూ పచ్చి చెలక్కాయలు వుప్పేసి వుడక బెట్టుకుని తింటున్నారు.

'ఏటీ... ఏటయ్యింది' అన్నాడు బావ.

బోరున ఏడ్చింది మా లచ్చిమి. తల్లి ఏడుపుకి దాని సంకలో పిల్ల బేరుమంది.

'ఏటే ఏటీ ఏడుపుల సంత. నిన్నెందుకు సదివించి నానే, ఆలోచననేకండా ఏడుత్తన్నావు?' చిన్నగా విసుక్కున్నాడు బావ.

'ఫ్యాక్టరీలో చాలామందిని ఉద్యోగాల్లోంచి తీసేస్తన్నారు. ఈళ్ల నాన్న ఉద్యోగం కూడా పోతాదేమో'.

'అయితే ఏడుపెందుకే. ఉద్యోగం పోనీ. టీ కొట్టెట్టుకుంటాడు. నువ్వు పది చదివావు. నువ్వూ పని సెయ్యి. మా కంటె గూడా కులాసగుంటారు'.

బావ దీమాకి ముక్కున ఏనేసుకున్నాను.

మా లచ్చిమి టెలిపోను కొట్లో పనిసెయ్యటం మొదలెట్టింది.

సూర్రావు టీ కొట్టెట్టేడు.

ఇంటో మా లచ్చిమి కూతురు 'సుమ'తో తనకి వూసుపోతోంది.

'సూశావే నరసా, ఏదొచ్చినా మన మంచికే అనుకోవాల' అన్నాడు బావ.

అయితే మా లచ్చిమి పని సెయ్యటం, ఆల్లిక్కడే వుండి బాగుపట్టం సెంద్రికకి కట్టమైంది.

'ఆ పనేదో ఆళ్ల వూరెల్లి సెయ్యొచ్చుగా'!

'అలగెలగ. అక్కడాల్లకి సంటిపిల్లని ఎవరు సూత్తారు?' అన్నాది తను.

గొడబగొడబ!

'ఎశ్. బాగుంతే గూడా గొడబలేనా? సెంద్రికా నువ్వూ పని సెయ్యి' అన్నాడు బావ.

'నేను పది చదవలేదు'.

'పని సెయ్యాలంటే సెయ్యొచ్చు. పది చదవలేదనుకున్న దానివి, మరి మా లచ్చిమి మీన కచ్చపెట్టుకు న్నావేల?'

సెంద్రిక మాటాడలేదు.

# అద్భుతమైన ప్రేమ



పాఠక జనంలో ఉన్న లలితమయిన శృంగారం, ప్రేమ నన్ను ఎప్పుడూ ఎక్కువగా సమ్మోహితం చేస్తాయి. ప్రతి వారు భార్య ప్రేమకు గుర్తింపుగా తాజ్‌మహల్ నిర్మించరు. అయితే, అద్భుతమైన ప్రేమ చాలా జంటల్లో ఉంటుంది. అది తలుచుకు రాసిన కథ 'ఏలయిపోనాది'. 'నవ్య' పత్రిక 'ఆంధ్రజ్యోతి'గా ఉన్నప్పుడు నా 'తురాయి పువ్వులు' కథకు ప్రథమ బహుమతి (1989) వచ్చింది. మళ్లీ ఇప్పుడు.. కొత్త ఏడాదిలోని నాకు ఇంత మంచి కానుక ఇచ్చిన 'నవ్య'కు ధన్యవాదాలు.


**– జంధ్యాల మాలతి**
**కేరాఫ్ వై.వి.మోహనరావ్**
**కస్తూరినగర్, ఫోర్ట్ లైన్, ఎల్ఐసి దగ్గర**
**రాయగడ – 765001**
**సెల్ : 09937982949**


'నీకూ పని సూసి పెడతాలే' అని.

కానమెంటు ఇసుకూలులో సిన్నసిన్న పిల్లల్ని సూడ్డానికి సెంద్రికని అప్పగించాడు బావ.

తను కూడా సంపాదిస్తంది. సెంద్రికకి ఆనందమయింది.

తనకూ ఆనందమయింది. పెద్దోడి కొడుకునీ, మాలచ్చిమి కూతుర్నీ ఆడిస్తుంటే..

బావ దేనికీ ఇసుక్కోడు. ఏదీ కట్టమనుకోడు.

ఏ పని సేత్తే అందరూ బాగుంటారో, అందరూ కలిసుంతారో ఆ సంగతులు సూత్తాడు.

అందుకే బావంటే తనకు అంత ఇట్టం.

రోజులేం సెకనికా ఎల్లం లేదు. మద్దిలో వానల్లేక పంటలు పోనాయి. తిండిక్కరువొచ్చింది.

'ఎలగరా బగమంతుడా, ఈ సంసారం ఎలగ?' అని తను పైకే అనుకుంటా వుంది.

'ఎలగెలగ అనుకుంతే అంతే. కట్టాన్ని కట్టమనుకోకుండా మనం ఇదివరకటి కన్నా కట్టపడాల'

'ఏం సేద్దాం?' అంది తను.

'నాను తాపీ పనికి ఎల్తాను'.

'నీకు రాదే?'.

'అదేనెశ్. కూలి పని. కొంచెం డబ్బొస్తది కద. అందలోనే బతుకుదాం'.

'నాను నీల్లు మోస్తాను. ఇల్లల్లో' బావ అడ్డెట్టనేదు.

పెద్దోడు, సిన్నోడు, బావ, తను – ఇంతమందిమి పైన పన్లు సేత్తంటే పాపం పెదకోడలు సూరేకాంతం పిల్లల్ని సూసుకుంటా ఇంటిపన్లు జేసేది.

కట్టకాలం ఇట్టే గడిసిపోనాది. బావకి బతికే వుపాయాలు తెల్సు.

అందరం ఒక తాటిమీనుంటే బాధలుండవని తెలుసు!

ఓ రోజు బావ 'ఈపు దురదగా వుంది రారా బుజ్జిగా' అంటూ పెద్దోడి కొడుకు ఎంకట్రావుని ఈపు గోకి పెట్టమన్నాడు. ఆ వీపు గోకతావుంటే హాయి గుందంటూ కల్లు మూసుకున్నాడు.

కుంసేపటికి ఆడు, 'తాతో, ఆడుకుంతాన'ని బైట కెలి పోనాడు.

'నరసా గోకతా వుంటే బానే వుంది కాని, ఈపు బాగా మంటెక్కిపోనాదే. దేంతో గోకాడే ఈడు?' తను కిందకి సూసి, 'ఇంకేటి కొబ్బరి పీసు. ఈపు రకతం సిమ్మింది. సిన్నోడి. నడిగి పగడరు తెత్తానండు'.

పగడరు తెచ్చి బావ ఈపుకి బాగా పట్టించి నాను. 'ఈపుకి సున్నం కొట్టినట్టుంది' తను నవ్వుతోంది. ఈ లోపల సెంద్రిక మంచి వూపు మీద ఒచ్చింది.

'అస్తమానం సిన్నోడా, సిన్నోడా అంటారేం. ఆయనకేం పేరు లేదా? రేపు పిల్లడి తండ్రి కాబోతన్నాడు. పేరెట్టి పిలండి' అన్నాది.

'అరె, మంచిమాట సెప్పినావు. నోరు తీపిసెయ్యి నరసా' నాను పంచదార తేటానికి లోపటకెల్లా.

'పేరు ల్లేకేం పెద్దోడు సత్తెం, సిన్నోడు సేకరం. సిన్నప్పట్నుంచీ ఆల్లని పెద్దోడా, సిన్నోడా అని పిలడం అలవోటు!'

'ఇగ నుంచి పేరెట్టి పిలండి మా ఆయన్ని'.

'ఏటో గంద్రగోలం. పోన్లే. నరస అలగే పిలుసుద్ది. నాయలవాటు నాది'.

సిన్నోడు సేకరానికి కవల పిల్లలుట్టేరు. రామా, లచ్చనా అని పేర్లెట్టింది కోడలు. ఇంకా సంబరమైంది.

ఓ రోజు 'నరసా, నోరు సేదుగుంది. నిన్ననే ఊట్ట మెచ్చి తగ్గింది కద. పెద్దోడి దగ్గర ఒక్క పలుకుంటది అడిగితేయే' అన్నాడు.

నాను తిరిగొచ్చి 'పెద్దోడి దగ్గరున్నది ఒక్క పలుకు గాదంట. గుటకా అంట. అయ్యకియ్యను. మంచిది కాదన్నాడు' అని సెప్పేను.

'ఏటి కొంప మునిచినాడీడు. గుటకాతింటన్నాడా?' అని బాధ పడ్డాడు.

తరవాతి సంవత్సరం పెద్దోడి గొంతుకి రాచపుండయినాది.

ఇల్లూ వాకిలీ అమ్మి ఆణ్ని రచ్చిద్దామని సూశాడు బావ.

పెద్దవొయిసులో ఈ కట్టం రాసి పెట్టున్నాది.

పెద్దోడు పోయినంక బావే మారిపోనాడు.

అంతోరకూ అన్నీ తన సేతుల్లోనే వున్నట్టు తనే అంతా అయి తిరిగేడు.

ఇప్పుడు కొంపా పోయె, పెద్దకొడుకూ పోయె.

కుంగి పోనాడు. మంచం పట్టేసినాడు.

సంజె ఇంక మల్లిపోతా వుంది.

అసురసంజె కమ్ముతా వుంది. అసుర సంజెలో బయటికి పోగూడదంటారు.

కానీ నా బావ... రమ్మని పిలుత్తా వుండాడు.

నా నెల్లాలి, బావ పిలుపు ఇనబడ్తా వుందిగాని, ఎక్కడున్నాడో తెల్దాయె!

కోట బురుజు మీన ఏ మూలో వుండి వుంటాడు.

సుక్కదూరితే నాకవుపించదు. ఏలయిపోనాది, ఎలిపోవాల.

'నా రానివి నువ్వే. రమ్మంతన్నాడు' నానిక ఎల్లాలి.

పాత ముచ్చట్లన్నీ అందరకూ సెప్పా. బావతో కొత్త ముచ్చట్లాడాలి!! ఎళ్లాలి! ఏలయిపోనాది!!

*